సాక్షి
పెద్దపల్లి

బుధవారం । 3 । జూలై । 2024



అభివృద్ధి పనుల పరిశీలన

మంథని: శ్రీరాంనగర్, శ్రీపాదకాలనీ, బొక్కల వాగు సమీప డ్రైనేజీ, మున్సిపల్ భవనం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు అవసరమైన స్థలాలను అదనపు కలెక్టర్ అరుణశ్రీ పరిశీలించారు.



రెస్క్యూ జీఎంకు సన్మానం

గోదావరిఖని: వకీల్‌పల్లి గని ఏజెంట్‌గా పనిచేసి పదోన్నతిపై రెస్క్యూ జీఎంగా బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్‌రెడ్డిని ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ మంగళవారం ఘనంగా సన్మానించారు.

గరిష్టం/కనిష్టం
34.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పార్టీలకు అతీతంగా అభివృద్ధి



ఎంపీపీ కరుణశ్రీని సన్మానిస్తున్న విప్ లక్ష్మణ్

ధర్మారం(ధర్మపురి): ప్రజాసమస్యల పరిష్కారంతోపాటు పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన చివరి సర్వసభ్య సమావేశం ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ అధ్యక్షతన జరిగింది. విప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తనకు రాజకీయ భవిష్యత్ ఇచ్చిన ధర్మారం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్‌ను ఎంపీపీ కరుణశ్రీ, మేడారం సింగిల్‌విండో చైర్మన్ బలరాంరెడ్డి సన్మానించారు. అనంతరం ఎంపీపీ కరుణశ్రీ దంపతులతోపాటు ఎంపీటీసీలను విప్ లక్ష్మణ్‌కుమార్ సన్మానించారు. పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలతోపాటు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రజిత, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విరసం ఆవిర్భావ వేడుకలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న నేతలు

పెద్దపల్లిరూరల్: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఈనెల 4న విప్లవ రచయితల సంఘం ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తామని విరసం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య అన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమారస్వామితో కలిసి స్థానిక అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. విప్లవోద్యమాన్ని దెబ్బతీసేందుకు, ఆదివాసీలను చంపేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఈఏడాదిలో ఇప్పటివరకు ఆపరేషన్ కగార్ పేరిట 130మంది ప్రాణాలను బలిగొందని ధ్వజమెత్తారు. నాయకులు శ్రీపతి రాజగోపాల్, నార వినోద్, సత్యనారాయణ, రాజలింగం, మల్లన్న, గుమ్మడి కొమురయ్య, గాండ్ల మల్లేశం, సదానందం, రవీందర్, సుధాకర్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పెద్దబొంకూర్‌లో విచారణ

పెద్దపల్లిరూరల్: పెద్దబొంకూర్ గ్రామపంచాయతీలో రెండేళ్ల క్రితం దుర్వినియోగమైన నిధుల రికవరీపై డీఎల్పీవో వేణుగోపాల్ మంగళవారం విచారణ జరిపారు. ఎంపీటీసీ మిట్టపల్లి వసంత భర్త వెంకటేశం ఫిర్యాదు మేరకు అప్పటి అధికారులు రూ.1,79,018 దుర్వినియోగమయ్యాయని తేల్చారు. ఈసొమ్మును 15రోజుల్లోగా ప్రభుత్వ ఖజానాకు జమచేయాలని 2022 జనవరి 20న షోకాజ్ నోటీసు జారీచేశారు. అయితే, రెండున్నరేళ్లు కావొస్తున్నా నిధులు రికవరీ చేయడం లేదని ప్రజావాణిలో చేసిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టామని డీఎల్పీవో తెలిపారు. కాగా, నిధులకు సంబంధించి ఆధారాలు చూపడంతో రికవరీ మొత్తం రూ.34 వేలుగా తేల్చారని, వీటిని రికవరీ చేయాల్సి ఉందని నివేదిక అందిస్తానని ఆయన వివరించారు.


పోలీసుల ఆకస్మిక తనిఖీ

గోదావరిఖని: రామగుండం సీపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పోలీసు కమిషనరేట్‌లో మంగళవారం పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలో ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా సోదా చేశారు. ధ్రువీకరణపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, బీమా, నంబరు ప్లేట్ లేని యాజమానులపై కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపైనా కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానా విధించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసినవారిపై కేసులు నమోదు చేశారు.

15లోగా దరఖాస్తు చేయండి

పెద్దపల్లిరూరల్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో మాధవి సూచించారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో అందించనున్న అవార్డుల కోసం హెచ్‌ఎంలు, టీచర్లు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతిపాదనల ధ్రువీకరణపత్రాలను డీఈవో కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

సదస్సుకు హాజరు కావాలి



మోత్కుపల్లి నర్సింహులుతో సురేందర్

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలో ఈనెల 21న నిర్వహించనున్న పార్లమెంట్‌స్థాయి సదస్సుకు హాజరు కావాలని మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులును మాదిగశక్తి వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్ సన్నీ కోరారు. ఆయన వెంట సుజిత్‌రావన్, గిరిరెడ్డి, ముకుందరెడ్డి ఉన్నారు.

సంక్షేమానికి దూరం

- ఏళ్లు గడిచినా మంజూరుకాని రేషన్‌కార్డులు
- కుటుంబ సభ్యుల పేర్ల నమోదుకూ అవకాశం లేదు
- జిల్లాలో 15 వేలకుపైగా దరఖాస్తుల పెండింగ్
- బియ్యం కోటా లేక పేద కుటుంబాల ఇబ్బందులు



ఓదెల మండలానికి చెందిన ఓ యువకుడికి 2014లో ఓ యువతితో వివాహం జరిగింది. ఆ దంపతులకు ఒక పాప, బాబు జన్మించారు. కుటుంబంలో నలుగురు సభ్యులయ్యారు. ఇప్పటికీ రేషన్ కార్డు జారీకాలేదు. ప్రతీనెల రేషన్ బియ్యం పొందలేకపోతున్నారు. గృహజ్యోతి ద్వారా 250 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇల్లు పథకాలు దరిచేరడంలేదు. వీటన్నింటికీ రేషన్‌కార్డు తప్పనిసరి కావడంతో భార్యాభర్తలిద్దరూ నిత్యం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తూనే ఉన్నారు. అయినా, వారికి కొత్త రేషన్‌కార్డు మంజూరు కావడంలేదు. ఇలాంటివారు జిల్లాలో సుమారు 15వేల మంది వరకు ఉన్నారు.

సాక్షి, పెద్దపల్లి: రేషన్‌కార్డు బహుళ ప్రయోజనాలకు ప్రామాణికం. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో లబ్ధి పొందేందుకు రేషన్‌కార్డును తప్పనిసరిచేసింది. 'అంగట్లో అన్నీఉన్నా.. అల్లుడి నోట్లో శని' అన్నట్లు.. అన్ని అర్హతలు ఉండి రేషన్ కార్డు లేక సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందలేకపోతున్నామని పేదలు వాపోతున్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒకేసారి కొత్తరేషన్‌కార్డులు జారీచేసింది. అందులోనూ చాలామంది అర్హులకు అందజేయలేదు. అప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికే అందులో అవకాశం కల్పించారు. దీంతో కొత్త దరఖాస్తులకు మోక్షం కలుగలేదు.

జిల్లాలో రేషన్ సమాచారం

తెలుపు	2,07,242
అంత్యోదయ	12,290
అన్నపూర్ణ	156
లబ్ధిదారులు	6,25,783
ప్రతీనెల కేటాయించే బియ్యం(క్వింటాళ్లలో)	32,377

మార్పుల్లేవు.. చేర్పులు ఉండవు..

- రేషన్‌కార్డు కలిగి ఉన్నవారికి ప్రభుత్వం కనీసం పేర్ల మార్పు, చేర్పుల కోసం అవకాశం కూడా కల్పించడంలేదు.
- దీంతో చాలామంది పేద కుటుంబాలు దరఖాస్తు చేసుకొని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాయి.
- ఏళ్లు గడుస్తున్నా రేషన్‌కార్డులు మంజూరు కావడంలేదు.
- కొత్త దంపతులు, వేరు కాపురం పెట్టుకున్న వారు, కార్డుల్లేని వారు వేలాదిమంది ప్రభుత్వ నిర్ణయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.
- కానీ, 2019 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోవడంలేదు.
- పాత కోటా ప్రకారమే రేషన్‌కార్డులపై బియ్యం పంపిణీ చేస్తున్నారు.

కొత్త కోడళ్లకు దక్కని రేషన్..

మార్గదర్శకాలు రావాల్సి ఉంది



జిల్లాలో రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులపై వచ్చిన దరఖాస్తుల వివరాలను ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదిస్తున్నాం. కొత్త రేషన్‌కార్డు దరఖాస్తుల వివరాలనూ పంపిస్తున్నాం. మంజూరు చేయడంలో ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల నుంచి వచ్చే మార్గదర్శకాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటున్నాం.

– ప్రేమ్‌కుమార్, డీఎస్‌వో

రేషన్‌కార్డులో పేర్లను సులభంగా తొలగిస్తున్నా.. అదేస్థాయిలో కొత్త పేర్లు నమోదు చేయకపోవడంతో పుట్టింటి నుంచి అత్తింటికి వెళ్లిన కొత్తకోడళ్లకు రేషన్ కోటా దక్కడంలేదు. వివాహమై ఇంటిపేరు మారినా.. రేషన్‌కార్డులో పేరు నమోదు కావడం లేదు. జిల్లాలో వేలమంది కొత్తకోడళ్లు తమ పేర్ల నమోదుకు దరఖాస్తు చేసుకొని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పేర్ల తొలగింపు ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది. కొత్త పేర్ల నమోదుకు ఆన్‌లైన్‌లోని ఆప్షన్‌ను ప్రభుత్వం లాక్ చేయడంతో సమస్య ఏర్పడుతోందని పేదలు వాపోతున్నారు. పేరు నమోదుకు నిరీక్షిస్తున్న వారిసంఖ్య సుమారు 15 వేలకుపైగా ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రగతి పనుల్లో భాగస్వాములు కావాలి



షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ తదితరులు

ధర్మారం(ధర్మపురి): ప్రభుత్వ స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టడంతో ఆర్థిక భరోసా కలుగుతుందని, అభివృద్ధి పనుల్లో పార్టీలకతీతంగా భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మేడారం సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌తోపాటు మండల పరిషత్ ఆధ్వర్యంలో నిర్మించిన మరో షాపింగ్ కాంప్లెక్స్‌ను మంగళవారం ప్రభుత్వ విప్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ చేస్తే కేటీఆర్, హరీశ్‌రావు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు మరోసారి బుద్ధి చెప్తారన్నారు. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, మేడారం, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్‌లు బలరాంరెడ్డి, నోముల వెంకటరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికే వార్డు సందర్శన

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంగా అవతరించిన పెద్దపల్లి పట్టణ అభివృద్ధిని గత పాలకులు విస్మరించారని, ప్రస్తుతం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకే వార్డు సందర్శన చేపట్టానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మున్సిపల్ పరిధిలోని 4, 23 వార్డుల్లో మంగళవారం కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీశ్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, పరిష్కరించాలని అధికారులకు సూచిస్తూ ముందుకు సాగారు. డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు, పింఛన్లు, మురుగునీటి కాలువలు తదితర సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. దశలవారీగా పింఛన్లు మంజూరవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల పంపిణీ పూర్తయిందని, ఇంకా అర్హులు ఉంటే తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ఉద్యమకారులను గుర్తించాలి



మాట్లాడుతున్న సులోచన, ప్రభాకర్‌రెడ్డి

మంథని: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి జార్ఖండ్‌లో మాదిరిగా పింఛన్లు అందించాలని తెలంగాణ ఉద్యమకారులు సువర్ణ సులోచన, మాదాటి ప్రభాకర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన పోరాటంలో శ్రమించిన తమ సేవలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులను గుర్తించి నివాసస్థలం, ఇందిరమ్మ ఇల్లు, బస్‌పాస్‌లు అందించాలని వారు కోరారు. ఉద్యమకారులు తోకల మల్లేశ్, చిదురాల మధుకర్, ముజీద్, మిరియాల రాజిరెడ్డి, దాసరి శంకర్, బొడ్డు వెంకటేశ్వర్లు, చాంద్‌పాషా ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

రామగుండం: రైల్వే రెగ్యులర్ ఓవర్ హాలింగ్ (ఆర్‌వోహెచ్) షెడ్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న బంపట్ల ప్రసాద్ ఆన్‌డ్యూటీలో గుండెపోటుతో మృతి చెందాడు. కాగా అతడి కుటుంబానికి పరిహారం చెల్లించాలని కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. రైల్వే ఏడీఎంఈ, సంబంధిత రైల్వే కాంట్రాక్టు సంస్థ ధనలక్ష్మి ఇంజినీరింగ్ ఎంటర్ ప్రైజెస్ ప్రతినిధికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. మృతుడు నిరుపేద కుటుంబానికి చెందినవాడు కావడంతో తక్షణమే అంత్యక్రియలకు రూ.లక్ష, రూ.20లక్షల పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగే దాకా దహన సంస్కారాలు నిర్వహించేది లేదంటూ కార్మికులు విధులను బహిష్కరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.భిక్షపతి, కోశాధికారి ఎం.రామాచారి, రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధి అజ్మీరా వీరన్ననాయక్, అనుమాస శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు అయోధ్యసింగ్, ఇసంపెల్లి అంజులు, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు మహేశ్, యాసిన్, ప్రదీప్, సరళ, శివ పాల్గొన్నారు.

సకాలంలో భూ సర్వే పూర్తి

- అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో భూ సంబంధిత సమస్యల పరిష్కారం, పలు ప్రాజెక్టులకు అవసరమైన భూ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తయ్యేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సర్వేయర్లతో సమావేశమై భూ సర్వే, సమస్యల పరిష్కారంపై ఆయన సమీక్షించారు. భూ వివాదాలను పరిష్కరించేందుకు వీలుగా సరిహద్దు సర్వే పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఎన్టీపీసీ భూ సేకరణ కోసం సదరు భూములు ఎవరి అధీనంలో ఉన్నాయో పరిశీలించి ఎంజాయ్‌మెంట్ సర్వే రైతుల వారీగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో భూ సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



ఆపరేషన్ ముస్కాన్ ప్రచార పత్రం విడుదల చేస్తున్న సీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ రాజు

గోదావరిఖని: బాలకార్మికుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశించారు. కమిషనరేట్‌లో మంగళవారం ఆపరేషన్ ముస్కాన్–10పై సమీక్షించారు. పాత కేసుల ఆధారంగా ఆయా ప్రాంతాల్లో నిఘా ఉంచి బాలకార్మికులను గుర్తించాలన్నారు. డ్రాపవుట్లను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు ఆస్పత్రులకు తరలించాలని అన్నారు. చిన్నపిల్లలను పనిలో చేర్చుకోబోమనే బోర్డులను షాపుల ఎదుట ప్రదర్శించాలని అన్నారు. గొర్రెలు, పశువుల కాపరులు, కిరాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లు, ఇటుక బట్టీలు, పౌల్ట్రీఫామ్‌లలో పనిచేసిసే, భిక్షాటన చేస్తున్న, తప్పిపోయిన వారిని గుర్తించాలని సూచించారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను వారికి అప్పగించాలని, లేనిపక్షంలో స్టేట్‌హోమ్‌కు తరలించాలని చెప్పారు. పిల్లలతో భిక్షాటన, వెట్టిచాకిరీ చేయించేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శ్రీధర్, మంచిర్యాల జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వహీద్ తదితరులు పాల్గొన్నారు.

పదవి లేకున్నా ప్రజల్లోనే..



ఎలిగేడు : స్థానిక ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్యే



జూలపల్లి : స్థానిక ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్సీ

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు
- స్థానిక ప్రజాప్రతినిధులకు ఘనంగా వీడ్కోలు

ఎలిగేడు/జూలపల్లి(పెద్దపల్లి): పదవీకాలం ముగిసినా నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాదరావు సూచించారు. ఐదేళ్ల పదవీకాలం ముగించుకోనున్న ఎలిగేడు, జూలపల్లి మండలాల్లోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలకు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నీతి, నిజాయతీగా పనిచేసిన ప్రజాప్రతినిధులకు మంచిగుర్తింపు ఉంటుందన్నారు. ఎలిగేడు ఎంపీపీ దంపతులు తానిపర్తి స్రవంతి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీటీసీలు తూడి లక్ష్మి, నారగోని ఎల్లవ్వ, ఇరుగురాల సావిత్రమ్మ, కొత్తిరెడ్డి ప్రేమలత, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ఖలీల్‌తోపాటు, జూలపల్లి ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, ఎంపీటీసీలను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయండి

- పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేశ్



మాట్లాడుతున్న పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్

రామగుండం: అంతర్గాం మండలంలోని ప్రభుత్వ భూముల్లో చిన్నతరహా పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేశ్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంతర్గాంలోని స్పిన్నింగ్, వీవింగ్ మిల్లులు మూతపడి సుమారు 39 ఏళ్లు గడుస్తోందని, నేటివరకు ఆ భూముల్లో పరిశ్రమలు స్థాపించలేదని అన్నారు. దీంతో విలువైన భూములు నిరుపయోగంగా మారుతున్నాయని తెలిపారు. మూడేళ్ల క్రితం ఐటీ పార్క్ పేరిట హడావుడిగా సర్వే చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. ఆ దిశగా ముందడుగు వేయలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఆ భూముల్లో ఆధునిక పరిజ్ఞానంతో కూడిన పరిశ్రమలు స్థాపించి స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పించి నిరుద్యోగాన్ని రూపుమాపాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నాయకులు బండి అశోక్, రాకేశ్, సంతోష్, లక్ష్మణ్, పొనగంటి రాజయ్య, పుట్ట సతీశ్, ఎలిగేటి సతీశ్, బోయపోతు సాగర్, వెంకటేశ్, సురేశ్, రాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిని సందర్శించిన ఈపీటీఆర్ఐ బృందం



వ్యూపాయింట్ వద్ద అంతర్జాతీయ ప్రతినిధులు

గోదావరిఖని: ఎన్విరాన్ ప్రొటెక్షన్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఈపీటీఆర్ఐ) బృందం మంగళవారం సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 ఏరియాను సందర్శించింది. పర్యావరణ ప్రభావ అంచనాల్లో భాగంగా ఓసీపీ–3ని సందర్శించింది. 'పర్యావరణ ప్రభావ అంచనా–అభివృద్ధి ప్రాజెక్ట్'పై రెండువారాల పాటు అంతర్జాతీయ శిక్షణను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్ దేశాలు, శ్రీలంక, ఇరాక్, తజకిస్థాన్‌తోపాటు 21 దేశాల నుంచి 31 మంది అంతర్జాతీయ ప్రతినిధులు పర్యటనలో పాల్గొంటున్నారు. ఓసీపీ–3 వ్యూపాయింట్ ద్వారా బొగ్గు ఉత్పత్తి, బ్లాస్టింగ్ చేసే విధానాన్ని ప్రతినిధులు పరిశీలించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్, సీహెచ్‌పీ నుంచి బొగ్గు రవాణా తదితర విషయాలను స్వయంగా చూసి వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణ అన్ని వివరాలు వివరించారు. ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్‌నదీమ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆలోచన అదుర్స్

ఆ రైతు ఆలోచన అదుర్స్.. కూలి ఖర్చు తగ్గించడంతోపాటు వరి నారు తరలించడం సులభతరమైంది.. తన ట్రాక్టర్‌కు ఎడ్ల బండి కట్టి.. అందులో వరినారు లోడ్ చేసి.. నాటు వేసే ప్రదేశానికి తరలించాడు. బురదలోనూ ఈ పద్ధతి సులభతరం కావడంతో మిగతా రైతులూ ఆచరిస్తున్నారు. పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామ శివారులో మంగళవారం ఈ దృశ్యం కనిపించింది.

– పెద్దపల్లిరూరల్



క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మల్లయ్య (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్‌/శంకరపట్నం: ఓ వ్యక్తి తన అత్తగారి ఊరైన హుజూరా బాద్‌ మండలంలోని వెంకట్రావుపల్లెలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని ఆముదాలపల్లికి చెందిన గాజబోయిన మల్లయ్య(37) సోమవారం తన ట్రాక్టర్‌ తీసుకొని, అత్తగారి పొలం దున్నేందుకు వెళ్లాడు. అయితే, ఆ పొలానికి దగ్గరలోని మరో పొలంలో స్థానికులకు మంగళవారం శవమై కనిపించాడు. చనిపోయిన చోట ట్రాక్టర్‌ రౌండ్లు వేసినట్లు ఉండటం, అది బోల్తా పడకపోవడం, మల్లయ్య చేతులకు గాయాలై, రక్తస్రావమవడంతో కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్‌ పేర్కొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


ఆగవ్వ (ఫైల్)

జగిత్యాలరూరల్‌: మండలంలోని బాలపల్లికి చెందిన పడిగెల ఆగవ్వ(103) మృతిచెందింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆగవ్వకు ఐదుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ల సంతానం. వీరిలో ముగ్గురు కుమారులు గతంలోనే చనిపోయారు. 3 నెలల క్రితం వరకు ఆమె తన పనులు తానే చేసుకునేది. 2 నెలల క్రితం గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స జరగడంతో ఆగవ్వ బాగోగులను కుమారులు చూసుకుంటున్నారు. ఈ క్రమంలో వృద్ధాప్య కారణాలతో మంగళవారం ఉదయం ఆమె చనిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మృతురాలి కుటుంబసభ్యులను ఓదార్చి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

వ్యక్తిని చితకబాదిన యువకులు

చిగురుమామిడి(హుస్నాబాద్‌): ఓ వ్యక్తిని చితకబాదిన ఐదుగురు యువకులపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్‌ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సైదాపూర్‌ మండలం దుద్దెనపల్లికి చెందిన నీలా శ్రీనివాస్‌ సోమవారం రాత్రి 11 గంటలకు స్వగ్రామం వెళ్లేందుకు సుందరగిరి చౌరస్తా వద్ద బస్సు కోసం చూస్తున్నాడు. మద్యం మత్తులో వచ్చిన గండె అఖిల్‌, గిరబోయిన అజయ్‌, వేణు, ఎల్కపెల్లి నాగరాజు, దుర్గం సుమిత్‌ అతన్ని చితకబాదారు. అంతటితో ఆగకుండా వెంట తెచ్చుకున్న బీరుసీసా పగులగొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించారు. వారి నుంచి తప్పించుకున్న శ్రీనివాస్‌ మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జగిత్యాల క్రైం: తాళం వేసిన ఓ ఇంట్లో దొంగలు పడి, బంగారు ఆభరణాలు చోరీ చేశారు. జగిత్యాల పట్టణ ఎస్సై నరేశ్‌ వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లికి చెందిన బొల్లం స్వాతి ఎలక్ట్రికల్‌ షాపు నిర్వహిస్తోంది. సోమవారం బంధువుల ఇంటికి వెళ్లింది. మంగళవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి, బీరువాలోని ఎనిమిదిన్నర తులాల ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆసియా క్రీడల్లో ‘యోగా’పై సంబరాలు

- 2026లో పతకాలు లేని ప్రదర్శన క్రీడగా..
- 2030లో మెడల్‌ రౌండ్‌లలో పోటీ
- పీటీ ఉష అభ్యర్థనకు ఒలింపిక్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఏషియా చీఫ్‌ ఓకే
- సంబరాల్లో క్రీడాకారులు




సంబరాల్లో యోగా సంఘం చైర్మన్‌ రవీందర్‌ సింగ్‌, డీవైఎస్‌వో శ్రీకాంత్‌ రెడ్డి, ఒలింపిక్‌ సంఘం ప్రతినిధులు

కరీంనగర్‌ స్పోర్ట్స్‌: మన దేశ సంస్కృతికి ప్రతీకైన యోగా క్రీడాభివృద్ధిలో కీలక పరిణామం చోటుచేసుకుంది. మినీ ఒలింపిక్స్‌ మాదిరిగా ఆసియా దేశాల్లో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఏషియన్‌ గేమ్స్‌లో యోగా చోటు దక్కింది. సోమవారం ఏషియాడ్‌ గేమ్స్‌ తాత్కాలిక అధ్యక్షుడు రణధీర్‌ సింగ్‌ నేతృత్వంలోని ఒలింపిక్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఆసియా(ఓసీఏ) ఎగ్జిక్యూటివ్‌ బోర్డు సమావేశంలో దీనికి గ్రీన్‌ సిగ్నల్‌ లభించింది.

జూన్‌ 21 యోగా దినోత్సవం

ఐక్యరాజ్యసమితి జూన్‌ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా గుర్తించడంతో ఆసియా దేశాల్లో ఈ క్రీడకు విశేష గుర్తింపు లభించింది. దీంతో భారత ఒలింపిక్‌ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష గత జూన్‌ 26న ఒలింపిక్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఏషియా చీఫ్‌కి లేఖ రాసి, ఆసియా క్రీడల్లో యోగాను ఒక క్రీడగా చేర్చాలని కోరారు. దీనికి వారు యోగాకు ఓకే చెప్పారు. 2026లో జపాన్‌లోని నగోయాలో జరగనున్న ఆసియా క్రీడల్లో ఎటువంటి పతకాలు లేకుండా యోగాను ప్రదర్శన క్రీడగా చేర్చనున్నారు. అలాగే, 2030లో జరిగే దోహా ఆసియాడ్‌లో మెడల్‌ రౌండ్లతో పోటీ క్రీడగా పరిగణించనున్నారు.

పోటీపడే అంశాలివే..

5 ఈవెంట్‌లలో యోగా పోటీలు జరగనున్నాయి. సంప్రదాయ యోగాసన, కళాత్మక యోగాసన (సింగిల్‌, పెయిర్‌), రిథమిక్‌ యోగాసన (జత, ఫ్రీ ఫ్లో/గ్రూప్‌ యోగాసన), వ్యక్తిగత ఆల్‌ రౌండ్‌ చాంపియన్‌షిప్‌, టీం చాంపియన్‌షిప్‌లలో పోటీలు జరుగుతాయి. విజేతలకు బంగారు, రజత, కాంస్య పతకాలు సైతం అందిస్తారు. పురుషులు, మహిళలకు కలిపి మొత్తం 15 పతకాలు(5 స్వర్ణాలు, 5 రజతాలు, 5 కాంస్యాలు) అందించనున్నారు.

జిల్లాలో హర్షాతిరేకాలు..

ఆసియా క్రీడల్లో యోగాకు చోటు కల్పించడంతో కరీంనగర్‌ జిల్లాలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. యోగా అసోసియేషన్‌ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో సంబరాలు జరిపారు. సీనియర్‌ యోగా క్రీడాకారులతోపాటు విద్యార్థులు, కోచ్‌లు వ్యాయామ ఉపాధ్యాయులు మిఠాయిలు పంచుకున్నారు. యోగాలో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్‌ ఉండనుందని తెలంగాణ యోగా అసోసియేషన్‌ చైర్మన్‌, యోగా అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు సర్దార్‌ రవీందర్‌ సింగ్‌ తెలిపారు. యోగాలో అంతర్జాతీయ వేదికలపై మన దేశ క్రీడాకారులు సత్తా చాటే అవకాశం కలిగిందన్నారు. ఇందుకు చొరవ తీసుకున్న భారత ఒలింపిక్‌ సంఘానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి శ్రీకాంత్‌ రెడ్డి, యోగా అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌.సిద్ధారెడ్డి, ఒలింపిక్‌ అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌ రెడ్డి, ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్‌, రమేశ్‌ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్‌ నీల ప్రసాద్‌, యోగా కోచ్‌ కిష్టయ్య, క్రీడా పాఠశాల కోచ్‌లు ఇందిర, పవన్‌, సాయిరాం యాదవ్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

యోగాకు ఆదరణ



యోగాకు తగిన గుర్తింపు ఇవ్వాలని మన దేశం చేసిన అభ్యర్థనకు ఓసీఏ అంగీకరించడం సంతోషదాయకం. యోగాకు ఆదరణ లభిస్తోంది. ఈ సమయంలో ఏషియాడ్‌లో చేర్చడం కీలక పరిణామం.

– జి.మనోహర్‌ కుమార్‌, తెలంగాణ యోగా సంఘం ప్రధాన కార్యదర్శి

క్రేజ్‌ మరింత పెరుగుతుంది



యోగాను ఒక క్రీడగా విశ్వవాప్తం చేయడానికి ఏషియాడ్‌ క్రీడలు శ్రీకారం చుట్టనున్నాయి. ఫలితంగా దీనికి క్రేజ్‌ మరింత పెరుగుతుంది. ఇప్పటికే అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నాం.

– ఎస్‌.సిద్ధారెడ్డి, యోగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, కరీంనగర్‌

సత్తా చాటే అవకాశం



ఇక నుంచి అంతర్జాతీయ వేదికలపై యోగాలో మన దేశ క్రీడాకారులు సత్తా చాటే అవకాశం కలిగింది. 2030 నుంచి ఆరంభం కానున్న ఈ క్రీడలో తొలి పతకం కూడా భారత్‌ సాధిస్తుందన్న నమ్మకం ఉంది.

– కిష్టయ్య, కోచ్‌

ఆర్టీసీ లక్కీ డ్రా విజేతల ఎంపిక


డ్రా తీస్తున్న వరంగల్‌ ఆర్‌ఎం విజయ భాను

హన్మకొండ: వరంగల్‌–నిజామాబాద్‌ రూట్‌ డీలక్స్‌ బస్సుల్లో ప్రయాణించిన మహిళల్లో విజేతల్ని మంగళవారం ఆర్టీసీ లక్కీ డ్రా తీసి ప్రకటించింది. హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్‌లో జూన్‌లో 15 రోజుల పాటు ప్రయాణించిన మహిళా ప్రయాణికుల టికెట్లను ఆర్టీసీ వరంగల్‌ రీజినల్‌ మేనేజర్‌ డి.విజయ భాను డ్రా తీసి విజేతలను ప్రకటించారు. కరీంనగర్‌కు చెందిన జి.కవిత (94900 43242), చొప్పదండికి చెందిన దేవమణి (ఫోన్‌: 84999 09575), ఆర్మూరుకు చెందిన రత్న (95506 01985) విజేతలుగా ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఆర్‌ఎం విజయభాను, వరంగల్‌–1 డిపో మేనేజర్‌ వంగల మోహన్‌రావు మాట్లాడుతూ.. డీలక్స్‌ బస్సుల్లో ప్రత్యేక గిఫ్ట్‌ బాక్సులను ఏర్పాటు చేశామని, మహిళా ప్రయాణికులు బస్సు దిగేముందు తమ టికెట్‌ వెనుక పేరు, ఫోన్‌ నంబర్‌ రాసి గిఫ్ట్‌ బాక్స్‌లో వేయాలని సూచించారు. ప్రతీ 15 రోజులకోసారి డ్రా తీసి, గెలుపొందిన మహిళా ప్రయాణికులకు బహుమతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్‌ మేనేజర్‌ ఆపరేషన్స్‌ కేశరాజు భాను కిరణ్‌, అసిస్టెంట్‌ మేనేజర్‌ చిమ్మని సంతోశ్‌ కుమార్‌, సిబ్బంది ప్రయాణికులు పాల్గొన్నారు.

రేపు బాలికల ఫుట్‌బాల్‌ జట్టు ఎంపిక పోటీలు

కరీంనగర్‌ స్పోర్ట్స్‌: కరీంనగర్‌ సెయింట్‌జాన్‌ పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి సబ్‌ జూనియర్స్‌ బాలికల ఫుట్‌బాల్‌ జట్టు ఎంపిక పోటీలను గురువారం నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్‌ సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గణపతి తెలిపారు. ఎంపికైనవారు త్వరలో మహబూబ్‌నగర్‌ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు 1 జనవరి 2011 నుంచి 31 డిసెంబర్‌ 2012 మధ్య జన్మించినవారు అర్హులని, ఆధార్‌కార్డు, జనన ధ్రువపత్రం, 4 పాస్‌పోర్టు సైజ్‌ ఫొటోలతో ఉదయం 9 గంటలకు పాఠశాలలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫుట్‌బాల్‌ సంఘం ఉపాధ్యక్షుడు అంతటి శంకరయ్యను 98491 14956 ఫోన్‌ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బాలికపై లైంగిక దాడికి యత్నించిన వృద్ధుడు

- దేహశుద్ధి చేసిన స్థానికులు

కాల్వశ్రీరాంపూర్‌(పెద్దపల్లి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై ఓ వృద్ధుడు లైంగిక దాడికి యత్నించాడు. పోలీసుల కథనం ప్రకారం.. బాలిక సోమవారం తన ఇంటి ఎదుట ఆడుకుంటోంది. ఆమెపై కన్నేసిన వృద్ధుడు మాయమాటలు చెప్పి, బస్సులు ఆగే స్థలంలోని బాత్‌రూంలోకి తీసుకెళ్లాడు. లైంగిక దాడికి యత్నించగా ఆ బాలిక భయంతో కేకలు వేసింది. స్థానికులు పరిగెత్తుకు వచ్చి, వృద్ధుడికి దేహశుద్ధి చేశారు. తర్వాత ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై బాధిత కుటుంబసభ్యులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భారతీయ న్యాయ సంహిత చట్టం కింద కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


గాయపడిన చిన్నారి

శంకరపట్నం(మానకొండూర్‌): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ములుగు జిల్లాకు చెందిన సిల్ల సారయ్య తన రెండేళ్ల కూతురితో కలిసి మంగళవారం జగిత్యాల నుంచి ద్విచక్రవాహనంపై స్వస్థలానికి వెళ్తున్నాడు. శంకరపట్నం మండలంలోని లింగాపూర్‌కు చెందిన కోడూరి మొగిలి కేశవపట్నం నుంచి బైక్‌పై స్వగ్రామం వెళ్తున్నాడు. కేశవపట్నం శివారులో రెండు వాహనాలు ఢీకొనడంతో పాపతోపాటు సారయ్యకు తీవ్ర గాయాలవగా మొగిలికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను పోలీసులు ఆస్పత్రికి తరలించారు.

టూరిస్ట్‌ మినీ బస్సు బోల్తా

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): టూరిస్ట్‌ మినీ బస్సు బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం.. టూరిస్ట్‌ మినీ బస్సు మంగళవారం కరీంనగర్‌ నుంచి కామారెడ్డి వైపు వెళ్తోంది. ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్‌–రగుడు బైపాస్‌ రోడ్డులోని పెద్దబోనాల శివారులో అతివేగం కారణంగా డివైడర్‌ను ఢీకొట్టి, బోల్తా పడింది. ఈ ఘటనలో డివైడర్‌ మధ్యలో ఉన్న కరెంటు పోల్‌ విరిగి, రోడ్డుపై పడింది. బస్సు డ్రైవర్‌ తీవ్రంగా గాయపడి, క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో చుట్టుపక్కల పొలాల్లో పనిచేస్తున్న రైతులు పరిగెత్తుకు వచ్చారు. అతన్ని బయటకు తీసి, 108కు ఫోన్‌ చేయగా సిబ్బంది వచ్చి, సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.


బోల్తా పడిన మినీ బస్సు

మేడిపల్లి, నిజామాబాద్‌లో చోరీలు


స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, నగదు


అరెస్టు చూపుతున్న పోలీసులు

- ఇద్దరు దొంగల అరెస్టు
- బంగారు ఆభరణాలు, వెండి, నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌

మెట్‌పల్లిరూరల్‌: మెట్‌పల్లి మండలం మేడిపల్లిలోని రెండిళ్లలో చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్‌ జిల్లా మాదాపూర్‌కు చెందిన దర్పల్లి సాయిలు, బాసరకు చెందిన కోసిడియా మోహన్‌ జల్సాలకు అలవాటుపడి, చోరీలు చేస్తున్నారు. ఇటీవల జగిత్యాల జిల్లా సరిహద్దు శివారులోని గండి హనుమాన్‌ ఆలయ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మేడిపల్లి, నిజామాబాద్‌లలో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి 3 ద్విచక్రవాహనాలు, 8 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.20 వేలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సాయిలుపై 22, మోహన్‌పై 14 కేసులు ఉన్నాయని, ఈ మధ్యనే జైలు నుంచి విడుదలై వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్‌, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్‌ వైర్ల దొంగ పట్టివేత


దొంగను తీసుకెళ్తున్న పోలీసులు

రామడుగు(చొప్పదండి): విద్యుత్‌ మోటార్లలోని వైర్లను ఎత్తుకెళ్తున్న దొంగను రామడుగు మండలంలోని షానగర్‌ రైతులు పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. వరంగల్‌ జిల్లా వర్ధన్నపేట మండలంలోని పీరామ్‌గూడకు చెందిన బొమ్మిశెట్టి అశోక్‌తో పాటు మరికొందరు మంగళవారం మధ్యాహ్నం షానగర్‌లో వరద కాలువ వెంట ఉన్న కరెంట్‌ మోటార్లలోని వైర్లను చోరీ చేశారు. వాటిని పందికుంటపల్లి వైకుంఠ ధామం రూమ్‌లో ఉంచడాన్ని రైతులు గుర్తించారు. అశోక్‌ను పట్టుకొని, వివరాలు తెలుసుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకొని, రామడుగు ఠాణాకు తరలించారు.

విధులకు ఆటంకం కలిగించిన వడ్డీ వ్యాపారుల అరెస్టు

మెట్‌పల్లి(కోరుట్ల): పోలీస్‌ విధులకు ఆటంకం కలిగించిన మెట్‌పల్లి పట్టణానికి చెందిన వడ్డీ వ్యాపారులు కటకం ప్రకాశ్‌, అతని కుమారుడు కార్తీక్‌లను అరెస్టు చేసినట్లు ఎస్సై చిరంజీవి మంగళవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్థానికంగా అనుమతి లేకుండా వడ్డీ వ్యాపారం చేస్తున్నవారి ఇళ్లలో గత ఏప్రిల్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రకాశ్‌ ఇంట్లోనూ తనిఖీ చేయగా పెద్ద ఎత్తున బంగారం, నగదు లభ్యమైంది. వాటిని సీజ్‌ చేయడానికి ప్రయత్నించగా, ప్రకాశ్‌తోపాటు అతని కుమారుడు కార్తీక్‌ అడ్డుకున్నారు. పోలీస్‌ సిబ్బందిని దూషించడమే కాకుండా ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించారు. దీనిపై అప్పట్లో కేసు నమోదైందని ఎస్సై పేర్కొన్నారు. ఈ మేరకు తండ్రీకుమారుడిని సోమవారం రాత్రి అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌ ఢీకొని మహిళ దుర్మరణం


లక్ష్మి (ఫైల్‌)

పెద్దపల్లిరూరల్‌: ఇసుక ట్రాక్టర్‌ ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. ఎస్సై లక్ష్మణ్‌రావు కథనం ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని అందుగులపల్లికి చెందిన ఆరె సదయ్య తన భార్య లక్ష్మి (38)తో కలిసి చొప్పదండిలోని అత్తగారింట్లో జరిగిన బోనాల పండుగకు వెళ్లాడు. మంగళవారం బైక్‌పై తిరిగి వస్తుండగా నిట్టూరు వద్ద రాంగ్‌రూట్‌లో అతివేగంగా వచ్చిన ఇసుక ట్రాక్టర్‌ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌ లక్ష్మి తల పైనుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సదయ్యకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారు ఢీకొని వృద్ధురాలు..

రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరికి చెందిన ధరావత్‌ సత్తమ్మ(60) కుటుంబసభ్యులతో కలిసి ఉపాధి నిమిత్తం పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల గ్రామానికి వచ్చింది. స్థానికంగానే ఉంటూ చుట్టుపక్కల ఊళ్లలో అల్లం, ఉల్లిపాయలు, మిరపకాయలు విక్రయిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం పెద్దకల్వలలోనే రోడ్డు దాటుతుండగా కరీంనగర్‌ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న ఓ కారు ఢీకొట్టి, వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కాగా, ఆమె ఇద్దరు కుమారులు గతంలోనే చనిపోగా కోడళ్లు, మనవలు, మనవరాళ్లు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బీజేపీ నాయకుడి మృతి


నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు


రాజు (ఫైల్‌)

పెద్దపల్లిరూరల్‌: బీజేపీ పెద్దపల్లి నియోజకవర్గ కన్వీనర్‌ పిన్నింటి రాజు చికిత్స పొందుతూ మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. బెజ్జంకి మండలంలోని తోటపల్లికి చెందిన రాజు పెద్దపల్లిలో ఉంటున్నారు. గతంలో బీజేపీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతుండటంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున చనిపోయారు. రాజు మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, నాయకులు అర్జున్‌రావు, సంజీవరెడ్డి, కన్నం అంజయ్య, పర్శ సమ్మయ్య, రాజేందర్‌, శ్రీనివాసరావు, తూడి రవీందర్‌ తదితరులు నివాళి అర్పించారు. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు. తోటపల్లిలో నిర్వహించిన అంత్యక్రియలకు పెద్దపల్లి నుంచి పలువురు నాయకులు తరలివెళ్లారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి..

ధర్మపురి: అతిగా మద్యం సేవించి, ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ధర్మపురిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండెపెల్లి మండలంలోని చింతలపల్లెకు చెందిన నల్ల మల్లేశ్‌(35) భార్య అతని నుంచి విడాకులు తీసుకొని, పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అతను గ్రామంలో ఉండలేక కొంతకాలంగా ధర్మపురిలోని తల్లి వద్ద ఉంటూ తాపీమేస్త్రీగా పని చేస్తున్నా డు. ఈ క్రమంలో అతిగా గుడుంబా, మద్యం తాగుతున్నాడు. సోమవారం రాత్రి కూడా అతిగా సేవించి, అంబేడ్కర్‌ విగ్రహం వద్ద జాతీయ రహదారి పక్కనున్న కంకర కుప్పపై పడుకున్నాడు. నిద్రలోనే మృతి చెందాడు. మంగళవారం ఉదయం రోడ్డు పై వెళ్తున్నవారు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఏ ఎస్సై రాజు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని, మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మల్లేశ్‌ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతిగా గుడుంబా, మద్యం సేవించి మృతిచెంది ఉంటాడని తెలిపారు. మృతుడి తల్లి పోశవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు. ధర్మపురిలో విచ్చలవిడిగా గుడుంబా తయారు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు.

గొధూర్‌కు చెందిన మహిళ..


లక్ష్మి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అనిల్‌

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని గొధూర్‌కు చెందిన నల్ల లక్ష్మి(54) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై అనిల్‌ తెలిపారు. ఆయన కథ నం ప్రకారం.. లక్ష్మి భర్త సంజీవరెడ్డి రెండేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకోగా అప్పటినుంచి ఆమె మానసిక వేదనకు గురవుతోంది. ఎవరితోనూ మాట్లాడేది కాదు. గత నెల 29న కుటుంబసభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా.. ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగింది. తర్వాత వచ్చిన కుటుంబసభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయింది. మృతురాలి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చాకుంటకు చెందిన యువకుడు..

చొప్పదండి: మండలంలోని చాకుంటకు చెందిన తడిగొప్పుల మహేశ్‌(27) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ఉపేంద్రచారి కథనం ప్రకారం.. తడిగొప్పుల కొమురయ్యకు ముగ్గురు కుమారులున్నారు. చిన్న కొడుకు మహేందర్‌ 2 నెలల క్రితం నగునూరులో రూ.6 లక్షల పెట్టుబడితో పెయింట్స్‌ దుకాణం ఏర్పాటు చేశాడు. వ్యాపారం అనుకున్నట్లు నడవకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీనికితోడు అప్పుల బాధ భరించలేక గత నెల 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహార మందు తాగాడు. కుటుంబసభ్యులు 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో మద్యానికి బానిసై, అప్పుల బాధతో, ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. వారి కుటుంబసభ్యులకు తీరని శోకాన్ని మిగిల్చారు.

మద్యానికి బానిసై యువకుడు..


అజయ్‌ (ఫైల్‌)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తంగళ్లపల్లి మండలంలోని నేరెళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. ఐతం అజయ్‌(25) మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజూ మద్యం సేవిస్తూ చుట్టుపక్కల వారితో గొడవ పడుతున్నాడు. పలుమార్లు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇంటికి వచ్చిన తల్లి విజయ ఎంత పిలిచినా పలకపోవడంతో పెద్ద కొడుకు అంజితో కలిసి తలుపులు బద్దలుకొట్టింది. లోపలికి వెళ్లి చూడగా ఉరేసుకొని కనిపించాడు. సంఘటన స్థలాన్ని తంగళ్లపల్లి ఎస్సై సుధాకర్‌ పరిశీలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో ఒకరు..


బాలమల్లు (ఫైల్‌)

కూతుళ్ల వివాహాలకు చేసిన అప్పులు తీర్చలేక, బాధతో మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇల్లంతకుంట మండలంలోని పత్తికుంటపల్లెలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. గుడిసె బాలమల్లు(58) తన ఇద్దరు కూతుళ్ల రేఖ, అరుణలకు వివాహాలు చేయగా అప్పులపాలయ్యాడు. వాటిని తీర్చే మార్గం లేకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. గత నెల 30న మద్యం సేవించి, భార్య ముత్తవ్వ, కొడుకు అరుణ్‌ను కొట్టడంతో వారు హైదరాబాద్‌ వెళ్లిపోయారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలమల్లు సోమవారం ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న అతడి భార్య హైదరాబాద్‌ నుంచి ఇంటికి చేరుకుంది. తన భర్త మరణంపై ఎటువంటి అనుమానం లేదని మంగళవారం ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌ గౌడ్‌ తెలిపారు.

కోనరావుపేటలో సుద్దాలవాసి..


శ్రీకాంత్‌ మృతదేహం

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన పల్లి శ్రీకాంత్‌(32) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీకాంత్‌ మద్యానికి బానిసయ్యాడు. దీనికితోడు కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం మధ్యాహ్నం కోనరావుపేటకు వచ్చి, బస్టాండ్‌ ప్రాంతంలో బస్సుకు అడ్డంగా పడుకొని, ఆత్మహత్యాయత్నం చేయగా ప్రయాణికులు అడ్డుకున్నారు. అక్కడి నుంచి వెళ్లిపోయి, సిరిసిల్లకు వెళ్లే దారిలోని ఓ వ్యవసాయ బావిలో దూకాడు. స్థానికులు కోనరావుపేట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఆంజనేయులు సంఘటన స్థలానికి చేరుకొని, ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య మధుషా, కుమారుడు, కూతురు ఉన్నారు.

పైడిపెల్లివాసి..

వెల్గటూర్‌ (ధర్మపురి): అప్పుల బాధతో వెల్గటూర్‌ మండలంలోని పైడిపెల్లికి చెందిన రుద్ర సత్తయ్య (46) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఉమాసాగర్‌ తెలిపారు. వారి వివరాల ప్రకారం.. సత్తయ్య డిష్‌ కాంట్రాక్టు తీసుకొని, ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. నష్టాలు రావడంతో గ్రామంలో అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించక పోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి, ఆరుబయట నిద్రించాడు. తెల్లవారుజామున ఇంట్లోకి వెళ్లి, ఉరేసుకున్నాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.